క్లుప్తంగా

రాములోరి తలంబ్రాల కోసం బుకింగ్ ప్రారంభం

భైంసాటౌన్: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా పొందవచ్చని.. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డీఎం అమృత అన్నారు. ఈ మేరకు శనివారం భైంసా బస్టాండ్ ఆవరణలో తలంబ్రాల బుకింగ్ కౌంటర్ ప్రారంభించారు. రూ.116 చెల్లించి పేరు నమోదు చేసుకున్నవారికి తలంబ్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్గో సిబ్బంది రవి, గంగారాం ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో లింబాద్రి తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని కద్దాల్ గ్రామంలో శనివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. నూతన ఆలయంలో హనుమంతుడి ప్రతిమకు పంచామృతాలతో అభిషేకం, పుష్పాలతో అలంకరణ చేశారు. ఈసందర్భంగా విగ్రహ దాత సునీత-రాములు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం అందించగా.. భక్తులు, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో శనివారం కల్లూర్ సన్నిధాన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. సర్పంచ్ భోజాబాయి, వైద్యురాలు మణీత, కార్యదర్శి సారిక, ప్రధానోపాధ్యాయుడు ఎల్లన్న, రజనీకాంత్, వంశీకృష్ణ, మానస ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన అల్లె నర్సవ్వ అనే మహిళ గతంలో మృతి చెందగా ఆమె నలుగురు కూతుర్లు అనాథలుగా మారారు. శనివారం బాధిత కుటుంబానికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కృష్ణంరాజు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, శ్రీనివాస్, రాకేశ్, దివాకర్, రాజన్న, రాజ్‌కుమార్, నవీన్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

లోకేశ్వరం: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలో స్వచ్ఛభారత్‌పై జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేయాలన్నారు. ఇంటింటా మరుగుదొడ్డి, ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయించడంతోపాటు మిషన్ భగీరథ నీరు వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు అబుబజార్, ఐకేపీ, ఉపాధిహామీ, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బ్యాంక్ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం



పాల్గొన్న న్యాయమూర్తి జితిన్‌కుమార్

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాంక్ లోక్‌అదాలత్ నిర్వహించారు. సంస్థ చైర్మన్, ఇన్‌చార్జి న్యాయమూర్తి జితిన్‌కుమార్ అధ్యక్షతన పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా పది కేసుల్లో రూ.8లక్షలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది చంద్రకాంత్, ప్రసేన్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కుంటాల: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కుంటాలలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. వారి వెంట కార్యదర్శి రాజాబాబు, తదితరులు ఉన్నారు.

అధ్వానంగా శివారుకాలనీలు

- ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా కాలనీవాసులు
- సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు



సీసీ రోడ్డు వేయకపోవడంతో కల్వర్టు పైనుంచి వాహనాలు వెళ్లలేని దుస్థితి

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని శివారుకాలనీల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో నుంచి వస్తున్న మురుగునీరంతా వచ్చి రోడ్డుపైకి చేరుతోంది. దీంతో సీసీ రోడ్లు లేకపోవడంతో నీరు నిలిచి మట్టిరోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. కనీసం నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటే ఆచితూచి నడపాల్సిందేనని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

భైంసా పట్టణంలోని నిర్మల్ రోడ్డులో శివారు కాలనీలు దాదాపు 15 ఏళ్ల కిందట ఏర్పడ్డాయి. ఎక్కువగా పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలే ఈ ప్రాంతంలో నివసిస్తున్నాయి. కాలనీల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా తమ ప్రాంతాల్లో మాత్రం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

ముఖ్యంగా డ్రెయినేజీలు లేకపోవడంతో దాదాపు ఇళ్లలో నుంచి వచ్చి చేరిన మురుగునీటితోనే రోడ్లన్నీ దర్శనమిస్తాయి. సీసీ రోడ్లు సైతం లేక గుంతలమయంగా ఉన్న మట్టిరోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల నీటి ఎద్దడితో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.



మట్టిరోడ్డుపై నిలిచిన మురుగునీరు



డ్రెయినేజీ గోడలోనే భగీరథ నల్లా కనెక్షన్

ఇష్టారీతిన పనులు..

భైంసా పాతపట్టణంలోని కొన్నిచోట్ల, శివారు కాలనీల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేవు. కాగా పట్టణంలో కొన్నిచోట్ల అభివృద్ధి పనులు ఇష్టారీతిన జరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. జనావాసాలు లేని, అవసరం లేని చోట సీసీ డ్రెయినేజీలు, రోడ్లు నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా అసౌకర్యాల నడుమ ఇబ్బందులు పడుతున్నామని.. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం

- ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి
- గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



కుభీర్: హంపోలిలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పక్కన నాయకులు

కుభీర్: దశలవారీగా గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. సొనారి గ్రామంలో రూ.నాలుగు లక్షలతో నిర్మించే మున్నూరు కాపు సంఘం భవనానికి, హంపోలి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కుభీర్, పార్డి(బి), నిగ్వా గ్రామాల్లో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మీరా, నర్సారెడ్డి, లక్ష్మీ, తిరుమల, మహిపాల్‌రెడ్డి, ఖదం గంగాధర్, చవాన్ శంకర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, వైస్‌ఎంపీపీ మోహినొద్దిన్, పీరాజీ, ఎంపీటీసీలు పోసానిబాయి, డి.దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

ముథోల్: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధితోపాటు పునరుద్ధరణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తరోడ గ్రామంలో రూ.12లక్షలతో మహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి, తరోడ తండాలో రూ.12 లక్షలతో జగదాంబమాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, సురేందర్, ఆరిపొద్దిన్ తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

కుంటాల: మండలంలోని ఓలాలో దివంగత కవి పంతులు ధర్మయ్య ఆశ్రమానికి నిధులు మంజూరు చేయాలని వాల్మీకిబోయ సంఘం సభ్యులు శనివారం భైంసాలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీస్‌ఫాతిమా, డీసీజీబీ డైరెక్టర్ వెంకటేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, పురుషోత్తం, సంఘం కన్వీనర్ విఠల్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న సయ్యద్ మహమూద్

లక్ష్మణచాంద: పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలకు అన్ని వసతులు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహమూద్ డిమాండ్ చేశారు. శనివారం సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లిన ఆయన కూలీలతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు తాగునీటి వసతి, టెంట్, మెడికల్ కిట్‌లు వంటి వసతుకల్పించాలన్నారు. రోజుకు రూ.600 వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సౌకర్యాలు కల్పించకుంటే తమ సంఘం తరపున ఆందోళన చేపడుతామన్నారు. ఇందులో కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'ఏలేటి' పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర సర్పంచ్ లత అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని శనివారం ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సరికెల గంగన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, పీచర ఎంపీటీసీ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

రైతుకు న్యాయం చేయాలని బైఠాయింపు



లోకేశ్వరంలో రోడ్డుపై బైఠాయించిన నాయకులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు కొబ్బనోల్ల గంగన్న కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళి మోహన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో పెద్దగంగన్న కుటుంబసభ్యులు, దళిత నాయకులతో కలిసి బైఠాయించి ధర్నా నిర్వహించారు. మురళీమోహన్ మాట్లాడుతూ పెద్దగంగన్న 33 ఏళ్లుగా సాగు చేస్తున్న అబ్దుల్లాపూర్ శివారులోని ఐదెకరాల భూమిని అబ్దుల్లాపూర్ వీడీసీ సభ్యులు కబ్జా చేశారన్నారు. దీంతో ఆ గ్రామానికే చెందిన దళితులను ఉసిగొలిపి గంగన్నపై దాడి చేయించడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. గంగన్నపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు. ధర్నాలో దళిత సంఘాల నాయకులు జాడి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో శనివారం స్వస్తి పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపనం, యజ్ఞం, అఖండ దీపారాధన, నవగ్రహ, అంకురారోపణం, క్షేత్రపాలక, యంత్ర సంస్కారం వంటి ప్రత్యేక పూజలను పురోహితులు రాజశేఖర్‌శర్మ, నరహరిశర్మ, సంతోష్‌శర్మ, రతన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రానికే చెందిన బొల్లి గంగారాం, సిందే వెంకట్రావు దంపతులు నవగ్రహ పూజలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అన్నదానం ఉంటుందని భక్తులు రావాలని సర్పంచ్ అరుగుమీది రాంరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశ్, జెడ్పీటీసీ చిన్నరామయ్య, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



భైంసాలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. నల్లని దట్టమైన మేఘాలతో పట్టణమంతా చీకటిగా మారింది. సాయంత్రం చల్లటి గాలులు వీచాయి. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది.

- భైంసాటౌన్

శాంతిభద్రతల రక్షణ కోసమే కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తానూరు: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కవాతు నిర్వహించినట్లు ముథోల్ సీఐ వినోద్ అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు కోలూరులో ముథోల్ సీఐ వినోద్ ఆధ్వర్యంలో ఆర్‌ఏఎఫ్ బలగాల కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ వినోద్ మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు సహకరించాలని.. అపరిచితులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. 40 మంది సిబ్బందితో కవాతు నిర్వహించగా ఎస్సై విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డును బాగు చేయరూ



లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద నుంచి మల్లాపూర్ మీదుగా పార్‌పెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు దెబ్బతింది. పార్‌పెల్లితండా నుంచి పార్‌పెల్లి వరకు వెళ్లే అర కిలోమీటర్ మేర కంకర తేలడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని పార్‌పెల్లివాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: అంజనేశ్వర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఫోన్: 70210 07310

పోషకులతో సమావేశం

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ సీర్ల లక్ష్మి, హెచ్‌ఎం జి.నర్సయ్య అన్నారు. శనివారం గ్రామంలోని పాఠశాలలో జరిగిన పోషకుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ తండ్రిగా అల్లి రమేశ్, ఉత్తమ తల్లిగా ఎ.రాజకళను ఎంపిక చేసి సన్మానించారు.

పాముపై కాలు మోపానని ఆందోళన

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో ఓ విద్యార్థిని పాముపై కాలు పెట్టాననే అనుమానంతో భయాందోళన చెందింది. శుక్రవారం రాత్రి వర్సిటీ ఆవరణలో నడుచుకుంటూ వెళ్తుండగా కాలి కింద మెత్తగా తగిలింది. దీంతో పాము కాటువేసిందని భయపడి వర్సిటీ హెల్త్‌సెంటర్‌కు వెళ్లింది. వైద్యులు ముందు జాగ్రత్తగా ప్రథమ చికిత్స చేసి భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పాముకాటు వేయలేదని వైద్యులు తేల్చడంతో తల్లిదండ్రుల కోరిక మేరకు విద్యార్థినిని వారితో పంపించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

అవగాహన ర్యాలీ

ముథోల్: మండల కేంద్రంలోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కంటిజబ్బులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు సుకన్య, సత్యనారాయణ, ఆస్పత్రి వైద్యులు సువర్ధన్, ముథోల్ సర్పంచ్ రాజేందర్, టీబీ సూపర్‌వైజర్ లాలయ్య, కంటి ఆస్పత్రి పర్యవేక్షకులు సందీప్‌రావు తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : కబ్జ
నారాయణ: బలగం

'పేపర్ లీకేజీపై విచారణ చేయండి'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లీకేజీ వ్యవహారంపై నిలదీసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. వారిని వెంటనే విడుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి దిలీప్, బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, శ్రీనివాస్, నాగనాథ్, పలువురు నాయకులు ఉన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: మంచిర్యాలలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ కోరారు. శనివారం పట్టణంలోని విశ్రాంతిభవనం ఆవరణలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం హక్కులను కాలరాసేలా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం లింగన్న, భూక్యా విలాస్, బానావత్ సంతోష్, మంచికంటి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో కుల సంఘాల భవనాలతోపాటు ఆలయాల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. శ్రీరాంనగర్ కాలనీలోని మున్నూరుకాపు సంఘ భవనం అభివృద్ధికి రూ.5లక్షలు, ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి రూ.రెండు లక్షలు, ఇందిరానగర్‌లోని కరీం కాలనీ మసీదు అభివృద్ధికి రూ.మూడు లక్షల చొప్పున ప్రొసీడింగ్ కాపీలను కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, సురేశ్, లింగేశ్వర్, వెంకటేశ్వర్లు, సతీశ్‌రావు, పాదం రాజన్న, సాయన్న, గంగాధర్ తదితరులు ఉన్నారు.